## క్లుప్తంగా

### మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



బోనకల్ గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ పుల్లయ్య

బోనకల్: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని మండల విద్యాశాఖాధికారి దామాల పుల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేసి.. రిజిస్టర్లు, కిచెన్ ఏరియా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదికను పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాల్లో తనిఖీ

వైరా: వైరా పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వైరా ఎస్సై పి.రామారావు శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణంలో రికార్డులు పరిశీలించి ఎరువులు, పురుగు మందులను పరిశీలించి మాట్లాడారు. నకిలీ మందులు ఇవ్వొద్దని, తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు.

### మొక్కలు నాటి రక్షించాలి

తల్లాడ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కోడూరు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కిష్టాపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి మాట్లాడారు. డీసీ రాజశేఖర్ రెడ్డి, బాలకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

### విద్యుత్ శాఖ - పొలం బాట

ముదిగొండ: మండలంలోని కట్టకూరులో విద్యుత్‌శాఖ - పొలంబాట కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిగొండ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పొలాల వద్ద విద్యుత్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సమస్య ఉంటే విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి తెలియజేయాలన్నారు.

### ఇంటర్ విద్యార్థుల ఘర్షణ

కారేపల్లి: రెండు గ్రూపులుగా విడిపోయిన ఇంటర్ విద్యార్థులు శుక్రవారం కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఘర్షణ పడ్డారు. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కొందరు గ్రూప్‌లుగా విడిపోయి కళాశాలలో వాగ్వాదానికి దిగారు. కళాశాల వదిలాక మళ్లీ బస్టాండ్ సెంటర్‌లో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈక్రమాన స్థానికులు వారించడం వెళ్లిపోయారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు, బస్వాపురం గ్రామాల్లోని లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రొద్దుటూరుకు చెందిన కన్నెపోగు ముత్తయ్య, బస్వాపురంకు చెందిన మార్గం విజయమ్మ లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ. 1.20 లక్షల విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిషోర్, గోపి, షాజహాన్, పాండురంగారావు పాల్గొన్నారు.

# ‘బడి’లోకి పోయేదెట్లా..?

- లోతట్టు ప్రాంతాల్లో పాఠశాలలు
- బురదమయంగా ప్రాంగణాలు
- అసౌకర్యాల నడుమ చిన్నారుల చదువులు
- మరమ్మతులు చేపట్టని పాలకులు, అధికారులు

ముదిగొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాల్లోని పాఠశాలల ఆవరణ మొత్తం నీటితో నిండి చెరువును తలపిస్తోంది. దీంతో విద్యార్థులు నీటిని దాటుకుని వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. అసౌకర్యాల నడుమ విద్యార్థులు వారి చదువులను కొనసాగించాల్సి వస్తుంది. పలుచోట్ల పాఠశాలలు మునగడంతో ఆరోజు సెలవు ప్రకటించాల్సిందే. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు చూస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.

**మండలంలోని వివరాలిలా..**

మండలంలోని 35 ప్రాథమిక పాఠశాలలు, 3 యూపీఎస్‌లు, 15జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నతపాఠశాల, న్యూలక్ష్మీపురంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, వల్లబిలోని గిరిజనుల ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,366 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

**తగ్గిన విద్యార్థుల సంఖ్య..**

గత మూడేళ్లనుచి పోలిస్తే.. ఐదువేలకు పైగా ఉండాల్సిన విద్యార్థులు భారీ సంఖ్యలో తగ్గారు. మాదాపురం, పెద్దమండవ, వల్లబి, పమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులున్నా



పమ్మి జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణ

సరిపోవడం లేదు. కమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. బాణాపురం ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు చెట్లకిందనే చదువును కొనసాగిస్తున్నారు. విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి కూడా క్రీడా మైదానాలు లేకపోవడంతో ఆటలకు దూరంగా ఉంటున్నారు. డిప్యూటీ సీఎం భట్టి పర్యటనలో భాగంగా కమలాపురం



మురుగులోనే బోరు, సంపు

గ్రామస్తులు వర్షాలకు పాఠశాల ఆవరణ నిండి ఉంటుందని, బట్టితో నింపాలని కోరగా.. భట్టి స్పందించినా, ఆ పనులు ఇప్పటి వరకు జరగలేదు.

**పీఈటీలు లేని పాఠశాలలు..**

ముదిగొండ మండలంలోని కమలాపురం, న్యూలక్ష్మీపురం, చిరుమర్రి, యడవల్లి, గంధసిరి, పండ్రేగుపల్లి పాఠశాలల్లోని విద్యార్థులకు క్రీడలు ఆడించే పీటీలే లేరు. దీంతో పాటు మండలంలోని 24మంది ఉపాధ్యాయులు భర్తీ కావాల్సి ఉంది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో 259మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఆ సారి విద్యావ్యవస్థ గాడిన పడే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..**



వర్షాలకు గ్రౌండ్‌నిండే పాఠశాలలను పర్యవేక్షించి పాఠశాల ల్లోని సమస్యలపై ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలపై నివేదిక పంపి పరిష్కరించేలా చూస్తాం.

– రమణయ్య, ఎంఈఓ, ముదిగొండ

**వర్షాలతో నీరు..**



ప్రతి ఏటా వర్షాలకు పాఠశాల ఆవరణ నిండి ఉంటుంది. దీంతో విద్యార్థులు లోపలికి వెళ్లలేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెద్ద వర్షాలకు సెలవు ప్రకటించాల్సి వస్తోంది. ఆవరణలో నీరు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పి.సురేష్, హెచ్‌ఎం, పమ్మి ప్రాథమిక పాఠశాల

# అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం

వైరారూరల్/కొణిజర్ల/కారేపల్లి: పట్టణ, పల్లెల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లిలో మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రెయిన్ నిర్మాణానికి, విప్పలమడకలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.92 లక్షల నిధులతో 26సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటుగా.. నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అదే విధంగా కొణిజర్ల మండలంలోని తనికెళ్ల గంగెద్దలపాడులో నూతనంగా నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్లను, రైతువేదికలో చేపట్టిన జాతర పనుల కార్యక్రమాన్ని, కారేపల్లి మండలంలోని గాదెపాడు గ్రామంలో రూ.20లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకుని పని చేస్తుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, మంజూరు కాని లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్నారు. తెలంగాణలో అభివృద్ధి జాతర జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఆశాలత, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్



కొణిజర్ల: తనికెళ్లలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ జైపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగారావు, ఐటీడీఏ డివిజనల్ ఈఈ బానోత్ రాజు, మండల ప్రత్యేక అధికారి చందన్‌కుమార్, తహసీల్దార్లు అరుణ, రమేష్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె నారాయణరావు, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీఓలు రవీంద్రప్రసాద్, ఉపేంద్రయ్య, స్థలదాత దాచేపల్లి కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### యూరియా అందించాలి

మధిర: రైతులకు షరతులు లేకుండా యూరియా అందించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు అన్నారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాంబాబు లకు వినతిపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సకాలంలో యూరియా అందడం లేదని, యూరియా కొంటే గుళికల ప్యాకెట్ కొనాలనే నిబంధనలు సరికాదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాబు, పార్టీ నాయకులు ఎస్‌కె లాల్మియా, డివిజన్ నాయకులు అప్పారావు, వెంకటేశ్వర్లు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ముదిగొండ: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ మురళి అన్నారు. శుక్రవారం మండలంలోని మేడేపల్లిలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ మండపాల వద్ద కమిటీ నిర్వాహకులు విద్యుత్ పట్ల నాణ్యమైన పరికరాలు వాడాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామస్తులు స్వతహాగా ముందుకు రావడంతో సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### బాలుడికి డెంగీ

బోనకల్: మండలంలోని తూటికుంట్లలో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న 13ఏళ్ల బాలుడికి డెంగీ సోకింది. బోనకల్ పీహెచ్‌సీలో శుక్రవారం చేసిన పరీక్షల్లో ఆయనకు డెంగీ సోకినట్లు నిర్ధారించారు.

### నష్ట పరిహారం ఇవ్వాలి

కొణిజర్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. కొణిజర్లలోని అంజనాపురం గ్రామాల్లో వరద ముంపుకు గురైన పత్తి చేలను ఆయా సంఘాల నాయకులు శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కృష్ణార్జునరావు, నరసయ్య, పురుషోత్తం, ప్రసాద్, నరసింహారావు, సురేష్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# సుందర పట్టణంగా తీర్చుదిద్దుదాం..



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్, తదితరులు

సత్తుపల్లిటౌన్: అందరు బాధ్యతగా మొక్కలు నాటి.. సంరక్షిస్తూ సత్తుపల్లి పట్టణాన్ని ఆహ్లాదకరంగా, సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు భాగస్వాములు కావాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కాకర్లపల్లిరోడ్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యాన అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటి ప్రారంభించారు. అనంతరం జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థఆధ్వర్యాన విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందించామన్నారు. విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా.. పరిష్కరించేందుకు 24 గంటలు తమ ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.గోపి, వైస్ ప్రిన్సిపాల్ పీర్‌సాహెబ్, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, గాదె చెన్నారావు, శివవేణు, తోట సుజలరాణి, చల్లగుళ్ల నర్సింహారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, ఎండి కమల్‌పాషా, సాంబశివరావు, కుమారి, ప్రసాద్ పాల్గొన్నారు.

**మాజీ ఎంపీటీసీకి నివాళి..**

తల్లాడ: తల్లాడ మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి సతీమణి, తల్లాడ ఎంపీటీసీ వేమిరెడ్డి రామతులసమ్మ భౌతికకాయాన్ని నారాయణపురంలో శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే కోటేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎంలు



మధిర : సాయికృష్ణమాచార్యులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

మధిర: స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వం హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించగా.. మధిర మండలంలోని మూడు పాఠశాలల్లో వారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సాయి కృష్ణమాచార్యులు మడుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా, కూసుమంచి మండలం నాయకన్‌గూడెం ఉపాధ్యాయురాలు ఎస్.రాజకుమారి దెందుకూరులో, చింతకాని మండలం లచ్చగూడెం ఉపాధ్యాయుడు పి.సుబ్బారావు ఇల్లూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు సుబ్బారావు, సాయి కృష్ణమాచార్యులు, రాజకుమారి లను యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు షేక్ నాగూర్ వలీ, ఏ.వినోదరావు, బి.నాగరాజు, ఈ.వీరయ్య, ఇబ్రహీం, సునీత, చెన్నయ్య, ఆర్.రంగారావు, ఆర్.బ్రహ్మారెడ్డి, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్, మదార్, బూసా కోటేశ్వరరావు, డి.శ్యామలరావు, మేడిశెట్టి కృష్ణారావు అభినందనలు తెలిపారు.

- తల్లాడ: కొణిజర్ల హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కొండా నరసింహారావు గౌడ్ తల్లాడ మండలం పినపాక జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

### టీచర్ ఆలస్యం కారణంగా సమస్య

– ‘సాక్షి’కథనంపై ఎంఈఓ వివరణ

కల్లూరురూరల్: మండలంలోని రఘునాధగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు టైంకు పాఠశాలలో కూర్చున్నప్పటికీ ఉపాధ్యాయుడు రాని విషయాన్ని ‘సాక్షి’లో శుక్రవారం ప్రచురితం కాగా.. కల్లూరు మండలం విద్యాశాఖ అధికారిని పత్తిపాటి నివేదిత వివరణ ఇచ్చారు. రఘునాధగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఒకే ఉపాధ్యాయిని ఉన్నారని, అనారోగ్యం కారణంగా ఆ టీచర్ సెలవు పెట్టడంతో.. పక్కనే గల రఘునాధబంజరు పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని పంపించామన్నారు. అయితే రంఘబంజరులో ముఖహాజరు వేసిన తర్వాత రఘునాధగూడెం వచ్చేసరిగా కొంత ఆలస్యమైందని, ఇకపై సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

### ఓపెన్ డిగ్రీకి దరఖాస్తు చేసుకోండి

మధిర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశానికి ఈనెల 30 వరకు గడువు ఉందని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేడ్కర్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ శీలం.ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్ , డిప్లమా, ఐటీఐ పాస్ అయిన వారు సంబంధిత సర్టిఫికెట్లతో మీసేవలో లేదా టీఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం 9553359879, 9666366833 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### ఎంపీడీఓకు వినతి

తల్లాడ: తల్లాడ మండలంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సురేష్‌బాబుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు లాల్‌మియా పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఉపాధి పనుల జాతర



బోనకల్: ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రమాదేవి

- బోనకల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమానికి శుక్రవారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనకల్‌లో ఎంపీడీఓ రమాదేవి పనుల జాతర పనులతో పాటుగా, రావినూతలలో రెండు క్యాటింగ్ షెడ్లను ప్రారంభించారు. లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, హార్టికల్చర్ పనులు, దివ్యాంగులు, వయోజనులు, మల్టీపర్పస్ వర్కర్లకు సన్మాన కార్యక్రమం, గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రీ, ఏపీఓ కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.
- ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు, మాము నూరు, రాజులదేవరపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ లో పూర్తి చేసిన పనులను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సిహారావు, ఈజీఎస్ ఏపీడీ ఆర్.రామకృష్ణ, ఎంపీడీఓ సురేంద్ర, ఏపీఓ కె.నాగరాజులు ప్రారంభించారు. అధికంగా పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జి.శ్రీలక్ష్మి, ఏపీఎం హరినారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.
- చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో 99రోజులు పనిచేసిన ఉపాధి కూలీ చెరుకూరి సంధ్యమ్మను, పంచాయతీకి సేవలందించిన మల్టీపర్పస్ వర్కర్ బుచ్చయ్యలను ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, నాగేశ్వరరావు, మల్లయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం పంచాయతీలో శుక్రవారం ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు పనుల మంజూరు పత్రాలను ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావు అందించారు. పశువుల షెడ్లు, గొర్ల షెడ్లు, కోళ్ల షెడ్లు, ఇంకుడు గుంతలు తదితర అభివృద్ధి పనులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంల ఏపీఓ బాబురావు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి, దాసరి మధు మోహన్‌రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**చిరంజీవి జన్మదిన వేడుకలు**



కేక్ కట్‌చేస్తున్న అభిమానులు

ఎర్రుపాలెం: సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని రింగ్‌సెంటర్‌లో శుక్రవారం ఆయన అభిమానులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మద్దికాయల ప్రవీణ్‌కుమార్, పుప్పాల శ్రీనివాసరావు, శ్రీపాలశెట్టి శివశంకర్, గాదె గోపి, గోగినేని సూర్యనారాయణ, కామిశెట్టి శివకృష్ణ, శ్రీపాలశెట్టి బాలకృష్ణ, రామకృష్ణ, కూర్మెళ్ల బాలాజీ, కడియం అరుణ్‌సాయి పాల్గొన్నారు.

**ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం**

సత్తుపల్లిరూరల్/తల్లాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో, తల్లాడ మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు నూతన ఆధార్ నమోదు, అప్‌డేట్, సవరణలు చేయించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు తాగునీటి, కూర్చొనే సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు.

**అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం**

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపేట సబ్‌స్టేషన్‌లో రూ.53 లక్షల వ్యయంతో అమర్చిన 3.15 ఎంవీఏ సామర్థ్యం గల అదనపు పీటీఆర్‌ను (ట్రాన్స్‌ఫార్మర్‌ను) ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం ప్రారంభించారు. దీంతో గ్రామాల్లోని రైతులతో పాటు అన్ని రకాల విద్యుత్‌వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించటం జరుగుతుందని సత్తుపల్లి విద్యుశాఖ డీఈఈ ఎల్.రాములు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ ప్రసాదరావు, ఏఈ కావ్య పాల్గొన్నారు.

**నారాయణ గుప్తా వర్ధంతి**

మధిర: స్వాతంత్ర్య సమర యోధుడు, మధిర గాంధీ బిరుదాంకితులు మిర్యాల నారాయణ గుప్తా 43వ వర్ధంతిని శుక్రవారం స్థానిక శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు మాట్లాడారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉత్తమ అవార్డు గ్రహీత తహసీల్దార్ రాళ్లబండి రాంబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామనాథం, కొండలరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**జీపీలకు నిధులు విడుదల చేయాలి**

చింతకాని: గ్రామ పంచాయతీలకు పారిశుద్ధ్య పనుల నిర్వహణకు తక్షణమే నిధులను విడుదల చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి శిరోమణి, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు పాల్గొన్నారు.

**పాఠశాలకు బీరువా బహుకరణ**

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.15వేల విలువైన బీరువాను శుక్రవారం దాతలు అందజేశారు. చెరుకూరి హనుమంతరావు, చెరుకూరి రామారావు, చెరుకూరి నాగేశ్వరరావు లు పాఠశాలకు బీరువా అందించారు. దీంతో హెచ్‌ఎం డి.సాయి కృష్ణమాచార్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, కోటేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి రూ.10వేలు వితరణ**

కల్లూరురూరల్: మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన గొల్లమండల సోలోమాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్లూరు మాజీ ఎంపీపీ బీరవెల్లి రఘు, పారిశ్రామిక వేత్త బీరవెల్లి శ్రీనివాసరావు సంయుక్తంగా ఆ నిరుపేద కుటుంబానికి రూ.10వేలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో నర్సింహారావు, లేహం, కృష్ణ, ప్రసాద్, ప్రకాశం, కోటేశ్వరరావు, వేణు పాల్గొన్నారు.

**మహా ధర్నాను విజయవంతం చేయండి**



మాట్లాడుతున్న నాగూర్ వలీ

మధిర: విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్ పీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 23న జరగనున్న మహాధర్నా విజయవంతం చేయాలని నాయకులు షేక్ నాగూర్ వలీ, తాళ్లూరి సుబ్బారావు, వై.కోటారెడ్డి కోరారు. శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ని పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు ఇబ్రహీం, చెన్నయ్య, మహమ్మద్ రఫీ, భీమ శంకరరావు, కమాల్, సత్యజిత్, బాజిఖాన్, ఆదాం, రమేష్, నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

**పీఆర్టీయూ మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరణ**

కల్లూరురూరల్/ఎర్రుపాలెం: పీఆర్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం బత్తులపల్లి, బనిగండ్లపాడు ప్రభుత్వ పాఠశాలల వద్ద పీఆర్టీయూ మహాధర్నా పోస్టర్లను కల్లూరు, ఎర్రుపాలెం మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు పాకాల రమేష్, బి.మదన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శులు షేక్ ఖాంద్ సాహెబ్, మారపాక బాబురావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటిన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించేంత వరకు పీఆర్టీయూ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రామారావు, మహేష్, రాజ్యలక్ష్మి, పార్వతి, నాగరాజు, రాఘవ, అప్పలరాజు, చిన్నప్ప, శివకుమార్, రమేష్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మంద కృష్ణ మాదిగ పర్యటనను జయప్రదం చేయండి**



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మధిర: ఈనెల 30న బోనకల్‌లో జరిగే మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కూరపాటి సురేష్ మాదిగ, ఎస్‌కె రంజాన్ కోరారు. శుక్రవారం మండలంలోని మాటూరు, నిధానపురం గ్రామాల్లో నిర్వహించిన వృద్ధులు, దివ్యాంగుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాయబారపు దాసు, ఏనూక మాదిగ పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న గణనాథులు

వైరా: వైరా మధిర రోడ్డులోని వ్యవసాయమార్కెట్ కమిటీ సమీపంలో వైరాకు రామాంజనేయులు రాజస్థాన్ నుంచి తెప్పించిన పరికరాలతో రకరకాల ఆకృతుల్లో గణపతి విగ్రహాలను తయారు చేయించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బుకింగ్‌లు చేసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పెద్దమొత్తంలో విగ్రహాలు తాయారు చేశారు. ఏ విగ్రహం చూసిన ఒకదానికి మించి మరోటికి అందంగా ఉండటంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

## అటెన్షన్ ప్లీజ్

### లీకవుతున్న పైప్‌లైన్

కల్లూరు ప్రభుత్వాస్పత్రి వెనుక మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ దగ్గర పైపు లీక్ అయ్యి 10 అడుగుల ఎత్తున పొంగుతూ వృథాగా పోతున్నాయి. తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నా లీకేజీకి మరమ్మతులు చేపట్టకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపను వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- కల్లూరు



ప్రశ్నించాల్సిన అధికారి : శివాని, మిషన్ భగీరథ ఏఈ

సెల్ నంబర్ : 7673974396